



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 11 సంచిక :122 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు సోమవారం 6 జనవరి 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 122 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE MON 6 JANUARY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఇస్రో చరిత్రలో మరో మైలురాయి.. స్పేస్ రోబోటిక్ ఆర్మ్ టెస్టింగ్ సక్సెస్



**పెన్ పవర్ డెస్క్:**భారత అంతరిక్ష పరిశోధనలో మరో మైలురాయి. అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్న ఇస్రో..ఆదిశగా సంచలన విజయం సాధించింది. అంతరిక్షంలో మొదటి రోబోటిక్ ఆర్మ్ ను విజయ వంతంగా పరీక్షించింది. రిలోకేటబుల్ రోబోటిక్ మ్యానిప్యులేటర్ టెక్నాలజీ డిమాన్ స్ట్రేటర్(RRM-TD) అని పిలువబడే ఈ రోబో టెస్టింగ్ ద్వారా అంతరిక్ష కేపబిలిటీలో ఇస్రో మరో ముం దుడుగు వేసింది. ఈ టెక్నాలజీని ఇస్రో ఇంటీరియల్ సిస్టమ్స్ యూనిట్ (IISU) తిరువనంతపురం లో అభివృద్ధి చేశారు.

వివరాలు 2లో..



## కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనల కోసమే
# మోదీ విశాఖ వస్తున్నారు

- ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోదీ పర్యటన
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని
- ఎన్డీయే విజయం తర్వాత తొలిసారి ఏపీకి ప్రధాని
- మోదీకి ఘనంగా స్వాగతం పలుకుతామన్న నారా లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, ఏపీ మంత్రి నారా లోకేశ్ విశాఖలో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను లోకేశ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కీలక ప్రాజెక్టుల శంకుస్థాపనల కోసమే ప్రధాని విశాఖకు వస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ తన పర్యటనలో నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, రూ.70 వేల కోట్ల ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, విశాఖ-చెన్నై ఎకనామిక్ కారిడార్ లో కృష్ణపట్నం వద్ద కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన... రూ.3,900 కోట్లతో పూర్తయిన రహదారుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేస్తారని లోకేశ్ వివరించారు. ముఖ్యమైనది, మనందరి కల విశాఖ రైల్వేజోన్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. గత ప్రభుత్వం కనీసం భూమి కూడా కేటాయించలేదని, దాంతో రైల్వే జోన్ ఆలస్యమైందని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం భూమిని కేటాయించడంతో, రైల్వే జోన్ భవన నిర్మాణాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని లోకేశ్ వివరించారు. ఇదేకాకుండా, పలు రైల్వే అభివృద్ధి పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

వివరాలు 2లో..

### విశాఖలో ప్రధాని పర్యటన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన నారా లోకేశ

- ఈ నెల 8న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ
- విశాఖలో పర్యటన
- ఎన్నికల తర్వాత తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్న ప్రధాని
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం
- విశాఖ కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించిన మంత్రి నారా లోకేశ్



## విజయవాడలో హైందవ శంఖారావం సభ... డిక్లరేషన్ ప్రకటించిన వీహెచ్ పీ



- వీహెచ్ పీ ఆధ్వర్యంలో కేసరపల్లి వద్ద భారీ ఎత్తున హిందూ సభ
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- హాజరైన చినజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితరులు

**పెన్ పవర్ డెస్క్:** హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల విశిష్టతను కాపాడడం, ముఖ్యంగా ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించడం తదితర అంశాలే అజెండాగా నేడు విజయవాడ కేసరపల్లిలో హైందవ శంఖారావం సభ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్ పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభకు లక్షలాదిగా తరలివచ్చారు. చిన్నజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితర ఆధ్యాత్మికవేత్తలు ఈ సభకు హాజరై కీలక ప్రసంగాలు చేశారు. కాగా, ఈ హైందవ శంఖారావం సభలో వీహెచ్ పీ కీలక డిక్లరేషన్ ను ప్రకటించింది. చినజీయర్ స్వామి హైందవ శంఖారావం డిక్లరేషన్ ను అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

**ఈ డిక్లరేషన్ లోని అంశాలు...**

ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇస్తూ చట్ట సవరణ చేయాలి

వివరాలు 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టులు మృతి



**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్ గఢ్ నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు, జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) హెడ్ కానిస్టేబుల్ సన్ను కారం మృతిచెందారు. నారాయణపూర్, దంతేవాడ జిల్లా సరిహద్దు వెంబడి దక్షిణ అబుజ్ మాద్ లోని అటవీప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన ఎన్ కౌంటర్ లో భద్రతా సిబ్బంది, మావోయిస్టు ఏరివేత ఆపరేషన్ లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు జరిగాయి. శనివారం అర్ధరాత్రి ఎదురు కాల్పులు ఆగిన తర్వాత ఘటనా స్థలంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలు, ఏకే 47 రైఫిల్, సెల్ఫ్ లోడింగ్

వివరాలు 2లో..

## బుద్దా వెంకన్న, బొండా ఉమలపై దాడి కేసు నిందితుడు తురకా కిశోర్ అరెస్ట్

- గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, బొండా ఉమలపై దాడి
- మాచర్లలో దాడికి పాల్పడిన తురకా కిశోర్
- కూటమి ప్రభుత్వం వచ్చాక అజ్ఞాతంలోకి వెళ్లిన కిశోర్
- తాజాగా హైదరాబాదులో అరెస్ట్


వివరాలు 2లో..



## అమెరికాపై పంజా విసరనున్న 'ఈ దశాబ్దంలోనే అతి తీవ్ర మంచు తుపాను'

- భారీ మంచు తుపాను ముంగిట అమెరికా
- వారం రోజుల పాటు తుపాను కొనసాగుతుందన్న వాతావరణ సంస్థలు
- దాదాపు 6 కోట్ల మందిపై ప్రభావం
- అమెరికాలోని పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ

వివరాలు 2లో..



## సాగు చేయని భూములకు రైతుబంధు.. రూ. 21 వేల 283 కోట్లు వృథా




**పెన్ పవర్ డెస్క్:**గత BRS సర్కార్ సాగు చేయని భూ ములకు రైతుబంధు నగదు వేసింది. సాగు చేయని భూములకు రైతుబంధు ఇవ్వడంతో ప్రభుత్వానికి మరింత భారం పడింది. ఇందుకు సంబంధించిన లెక్కను ప్రభుత్వం విడుదల చేసింది. 2019-20లో 68.93 లక్షల ఎకరాలకు

వివరాలు 2లో..

## ఈ నెల 26 నుంచి రైతు భరోసా అందిస్తాం

- రైతు భరోసా ఎగ్గొట్టారంటూ విపక్షాల విమర్శలు
- స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతు భరోసా మొత్తాన్ని కూడా రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామన్న పొన్నం
- కొత్త రేషన్ కార్డులు ఇస్తామని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**రైతు భరోసా పథకానికి మంగళం పాడారంటూ విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ, మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 26 నుంచి రాష్ట్రంలో రైతు భరోసా అందిస్తున్నామని ప్రకటించారు. అంతేకాకుండా, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులున్నా రైతు భరోసా నగదును పెంచామని పొన్నం వివరించారు.

వివరాలు 2లో..

## సీఎంఆర్ కాలేజీ కేసులో మరో ఇద్దరు అరెస్ట్..



**పెన్ పవర్ డెస్క్:**సీఎంఆర్ కాలేజీ కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు పోలీసులు. విద్యార్థునుల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా హాస్టల్ బాత్ రూముల్లో తొంగిచూసినందుకు గాను బీహార్ కి చెందిన కిశోర్, గోవింద్ లను ఆదివారం ( జనవరి 5, 2025 ) అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ ఇద్దరితో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు పోలీసులు. కాలేజీ చైర్మన్ చామకూరు గోపాల్‌రెడ్డి,కాలేజీ డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ అనంతనారా యణ, వార్డెన్ ప్రీతిరెడ్డి, క్యాంపస్ వార్డెన్ ధనలక్ష్మిపై కేసు నమోదు చేశారు పోలీసులు. తమను ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కిశోర్, గోవింద్ లపై ఫిర్యాదు చేసినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదని విద్యార్థునులు ఆరోపిస్తున్నారు.సీఎంఆర్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్ రూమ్‌లో విద్యార్థినుల నగ్న వీడియోలు చిత్రీకరణ ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. బాత్ రూమ్‌లో

వివరాలు 2లో..

## సింగరేణిని రాజకీయాలకు వాడం.. బలమైన ఆర్థిక శక్తిగా మారుస్తాం



**పెన్ పవర్ డెస్క్:**సింగరేణిని బలమైన ఆర్థిక శక్తిగా మారుస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ప్రజాభవన్ లో రాజీవ్ అభయ హస్తం స్కీం లాంచ్ సందర్భంగా మాట్లాడారు భట్టి. సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సింగరేణి కాలరీస్ తెలంగాణ రాష్ట్రానికి తలమానికం లాంటిదన్నారు. గత ప్రభుత్వం సింగరేణిని రాజకీయల కోసం వాడుకుందన్నారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సింగరేణి అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు భట్టి.

వివరాలు 2లో..

## డిప్యూటీ సీఎం కాన్వాయ్ కి ప్రమాదం.. అదుపు తప్పి పోలీస్ వాహనం బోల్తా..

**పెన్ పవర్ డెస్క్:**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరంగల్ పర్యటనలో ప్రమాదం చోటు చేసుకుంది.. కాన్వాయ్ లో ఉన్న పోలీస్ వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆదివారం ( జనవరి 5, 2025 ) జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా

వివరాలు 2లో..



## తెలంగాణలో మరో కొత్త పథకం.. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'.. ఏడాదికి రూ.12 వేలు..



**పెన్ పవర్ డెస్క్:** 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. రైతు భరోసాపై కూడా మరోమారు కీలక ప్రకటన చేశారు. ప్రతి ఎకరాకు ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసాను ప్రభుత్వం ఇస్తుందని స్పష్టం చేశారు. జనవరి 26 నుంచి రైతు భరోసాను పంపిణీ చేస్తామని పునరుద్ఘాటించారు.

వివరాలు 2లో..

## కృషి బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 05**

బాపట్ల నియోజకవర్గ పరిధిలోని నరసాయపాలెం గ్రామంలో జరుగుచున్న ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది కామేపల్లి కృషిబాబు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి,చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తదితర నాయకులు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# అభివృద్ధి అంటే తెలుగుదేశం...

# తెలుగుదేశమంటే అభివృద్ధి

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు - ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు -బొప్పుడి గ్రామ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ లావు, ఎంఎల్ఏ ప్రత్తిపాటి.**










**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 05 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలు మార్చివేస్తామని, రోడ్లు.. డ్రైనేజ్ లు.. కమ్యూనిటీ భవనాలు... తాగునీటి సౌకర్యంతో పాటు అన్నిరకాల వసతులతో రాష్ట్రంలోని గ్రామాలన్నీ కళకళలాడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి నియోజకవర్గంలోని బొప్పుడి గ్రామంలో 35.23 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సీసీ.రోడ్లు, డ్రైనేజ్ లు, అంగన్ వాడీ భవనం ప్రారంభించిన అనంతరం మాజీమంత్రి ప్రత్తిపాటి, ఎంపీ కృష్ణదేవరాయలు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరు ముఖ్యమంత్రి చంద్రబాబని, తెలుగుదేశమంటే అభివృద్ధి. అభివృద్ధి అంటే తెలుగుదేశమనే వాస్తవాన్ని ప్రజలు అంగీకరించాలన్నారు. బొప్పుడి గ్రామానికి గొప్ప చరిత్ర ఉందని, ప్రధానిమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత, మంత్రి లోకేశ్ సహా ఎందరో ప్రముఖులు ఈ గ్రామానికి విచ్చేసి ఇక్కడి అభివృద్ధిని చూశారన్నారు. గ్రామానికి సాగునీటి లిఫ్ట్ అందించామని, బైపాస్ రహదారి అందుబాటులోకి తీసుకొచ్చామని, గ్రామాభివృద్ధికోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ముందుకుసాగాలని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో పనిచేసేవారిని కాదని, ఎక్కడినుంచో వచ్చినవారిని గెలిపించారని,దాని ఫలితం ఇప్పటికీ అనుభవిస్తున్నామన్నారు అంతా సక్రమంగా జరిగితే ప్రధాని మోదీ చేతులమీదుగా చిలకలూరిపేట బైపాస్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన ప్రతి రైతుకి న్యాయం చేసే తీరుతామని, తాను ఎంపీ ఇద్దరం రైతుల పక్షమేనని పుల్లారావు స్పష్టం చేశారు. అరక దున్ని వ్యవసాయం చేసిన నాకంటే రైతుల బాధలు ఎవరికీ గొప్పగా తెలియవన్నారు. బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే కేంద్రప్రభుత్వం కొత్త విధివిధానాలు ఖరారు చేయనుందని, అవి రహదారుల నిర్మాణానికి భూములిచ్చే రైతులకు న్యాయం చేసేవిగానే ఉంటాయన్నారు. తాను గానీ, ఎంపీ గానీ గత పాలకుల్లా ఓట్లు వేయించుకొని ఇంట్లో పడుకునే వాళ్లం కాదని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు, బొప్పుడి గ్రామాభివృద్ధికి చేయాల్సిందంతా చేస్తామన్నారు. బొప్పుడి ఆంజనేయస్వామి గుడి కంటే మిన్నగా కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి గుడిని అభివృద్ధి చేస్తామని, అవసరమైతే టీటీడీని సంప్రదించి నిధులు సమకూరుస్తామని పుల్లారావు చెప్పారు. అమృతధార, జల్ జీవన్ మిషన్ పథకాల్లో భాగంగా బొప్పుడిలో ప్రతిఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే ప్రాజెక్ట్ ను కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే తమను అభివృద్ధి చేయమని వారు అడగడం సబబేనని, కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత పాలకుల అవినీతి వల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని నరసరావు పేట ఎంపీ కృష్ణ దేవరాయలు తెలిపారు. బొప్పుడి గ్రామంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం రూ.1200కోట్లు మంజూరు చేసినట్టు ఎంపీ తెలిపారు. సాగర్ నుంచి నీరు నేరుగా బొప్పుడి గ్రామంలోని వాటర్ హెడ్ ట్యాంక్ కు వచ్చేలా ఏర్పాటుచేస్తామన్నారు. గ్రామస్తులు అడిగిన కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై కూడా దృష్టి పెడతామని ఎంపీ చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఇప్పటికీ కొన్ని గ్రామాలకు సరైన తాగునీరు లేకపోవడం నిజంగా బాధాకరమన్నారు. చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామానికి అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని కృష్ణ దేవరాయలు స్పష్టంచేశారు.

## బాపట్లలో జనసేనకు చీలికలు...






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 5**

రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ అంటే ఎంతో గర్వించదగ్గ పార్టీ అని ప్రజలంతా బహిరంగంగా చర్చించుకుంటరు. కానీ బాపట్లలో మాత్రం జనసేన పార్టీకి సమన్వయం లేదని నియోజకవర్గంలో జోరు గా చర్చ జరుగుతుంది. బాపట్లలో జనసేన పార్టీ రెండు గ్రూపులుగా ఏర్పడ్డాయి అనే విషయం అందరికీ బహిరంగంగా తెలిసిందే. కూటమి కలయిక కలిసిన తర్వాత బాపట్లలో ఒక గ్రూపు ప్రతినిత్యం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోనే గడుపుతున్నారు. మరో గ్రూపు నియోజకవర్గంలో కూటమి కోసం వారి వంతు సహకారాన్ని అందిస్తూ ప్రచారం చేశారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూటమి ప్రభుత్వంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు జనసేన నుండి ఒక గ్రూపు సభ్యులు హాజరైతే మరొక గ్రూప్ సభ్యులు ఆగిపోవడం ప్రతినిత్యం జరుగుతూనే ఉంది. నియోజకవర్గంలో ఆ ఒక్క నాయకుడు మాత్రమే ఆధిపత్య చక్రాన్ని తిప్పాలంటూ సన్నాహాలు వేస్తున్నాడు అని ఆయన పక్కన తిరిగే వాళ్లే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన కొందరిని ఆ నాయకుడు దూరం చేసుకున్నాడు. ఆయన చేసే పనులకు పార్టీలో కార్యకర్తలు కూడా విసుగెత్తిపోతున్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీకి ఎంతమంది నాయకులు ఉన్నారనే విషయాన్ని వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చని కొందరు అంటున్నారు. పార్టీలో కొత్త సభ్యులు ఏర్పడితే నా పేరు పోతుందని పార్టీ నాయకులను ఎంతోమందిని దూరం చేసుకుంటున్నాడు ఆ నాయకుడు. పార్టీ కోసం నమ్మిన కార్యకర్తని కనీసం కుటమీ ప్రభుత్వం ఏర్పడ్డాక పట్టించుకునే పరిస్థితి బాపట్ల లో కరువైందని నియోజకవర్గం చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా జనసేన పార్టీ నాయకులంతా కలసి ఏకధాటిపై నడవాలని జనసేన నాయకులు అనుకుంటున్నారు.

## హైందవ శంకారావానికి కదిలిన మండల యువత

**బెల్లంకొండ పెన్ పవర్ ప్రతినిధి జనవరి 05**

విశ్వ హిందు పరిషత్ ఆంధ్రప్రదేశ్ వారిచే విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో ఏర్పాటు చేసిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు చంద్రాజుపాలెం గ్రామం బెల్లంకొండ మండలం నుండి యువత ఎంతో ఉత్సాహంగా ఉద్రూతలూగుతూ ముందడుగు వేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా తూమాటి కేశవాచార్యులు (ఆలయ అర్చకులు) వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రాన్ని పొంది 77 సంవత్సరాలు పూర్తి అయిన హిందువులకు మాత్రం తమ దేవాలయాలు తాము నిర్మించుకునే స్వాతంత్రత నేటికీ రాలేదన్నారు. విశ్వహిందూ పరిషత్ వారు ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన విధంగా దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తం చేసి , స్వయంప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని కోరిన మాటకు మనందరి పూర్తి మద్ధతు తెలియచేయాలని కోరారు. అనంతరం హిందూ ధర్మం కోసం పోరాడే నిత్య సామాన్య పౌరుడు కేశబోయిన వెంకటకోటేశ్వరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండించి, అన్యమతస్తులు జరిపే మతమార్పిడి వంటి దుష్ప్రచారాలను అడ్డుకోవాలని మండిపడ్డారు. తెల్ల దొరలను మన భారతదేశం నుండి తరిమి తరిమి కొట్టినప్పటికి హిందువుల బానిస సంకెళ్ళకు మాత్రం ఇప్పటికీ విముక్తి లభించలేదన్నారు. దేశం కోసం హిందూ ధర్మం కోసం దేవాలయాల రక్షణ కోసం ప్రతి ఒక్క హిందూ బంధువు చేయి చేయి కలుపుదాం మన హిందువుల బానిస సంకెళ్లకు విముక్తి లభించుకుందామన్నారు.




హిందువుల మనోభావాలను , సమస్యలను అర్థం చేసుకొని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్న లక్ష్యంతో హిందూ బంధువులందరూ లక్షలాదిగా పాల్గొని విజయవంతం చేసి ఈ ఉద్యమానికి బాసటగా ఊపిరిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ హిందూ శంఖారావ భారీ బహిరంగ సభకు కవ్వాల శ్రీను,తమటం సాంబశివరావు, ఈర్ల శ్రీను,జడ సైదా బాబు, గాదం శివరామ్, ప్రహ్లాద్,దుర్గారావు,ఆది వెంకట్ రావు,మేకల శివయ్య , వీర్ల వెంకయ్య,మేకల సాంబ,గొర్రె సాంబశివరావు, యాసం సాయి,రాజు,తిరుమల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల అనుభవం గల భూమిని తప్పుడు రికార్డులతో మార్చేసారు?

## తెరవెనుక రెవెన్యూ అధికారుల హస్తం!
## మొరపెట్టుకున్నా కనికరించని అధికారులు

**పలమనేరు జనవరి 05,(పెన్ పవర్):**

దశాబ్దాలుగా తమ అనుభవంలో గల భూమిని తప్పుడు రికార్డులతో అర్హత లేని వ్యక్తుల పేరుతో మార్చేసారని గంగవరం మండలం లోని కీలపట్ల పంచాయతీ కేంద్రానికి చెందిన బాధిత రైతులు బజంత్రీ దీనదయాల్, బజంత్రీ బాబు,గాండ్ల సుబ్రహ్మణ్యం ఆరోపించారు. ఈమేరకు ఆదివారం బాధిత రైతులు విలేకరులతో మాట్లాడుతూ...గత 90సంవత్సరాల క్రితమే మాతాతల కాలంలో ఇక్కడ నున్న కొత్తపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 44-5లోని 2ఎకరాల 65 సెంట్ల ప్రభుత్వ భూమిలో రాళ్లు, రెప్పలు,ముళ్ల కంపలతో నిండి అడవిని తలిపించేలా నున్న భూమిని,సాగుకు పనికి వచ్చేలా చేసి,అందులో వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే వాళ్ళమని అన్నారు.ఇలా దశాబ్దాలుగా అనుభవంలో నున్న భూమికి దరఖాస్తు పట్టా ఇవ్వాలని కొన్ని సంవత్సరాలుగా సంబంధిత రెవెన్యూశాఖ అధికారులకు పలుమార్లు అర్జీలు ఇచ్చామన్నారు.

**తప్పుడు రికార్డులతో ఇతరులకు ఇచ్చేసారు**

ఈ నేపథ్యంలో గత 2024వ సంవత్సరం మండల రెవెన్యూ అధికారులకు నేరుగా వెళ్లి తమ ముగ్గురు రైతుల పేరుతో పట్టాలు ఇవ్వాలని మొరపెట్టు కొన్నామన్నారు. అయితే అప్పటి మండల రెవెన్యూ అధికారులు తమ ప్రాంతానికి ఎటువంటి సంబంధం మరియు అర్హత లేని వ్యక్తుల పేరుతో డి.కె.టి పట్టా ఇవ్వడం జరిగిందని వాపోయారు.కొన్ని దశాబ్దాలుగా ఆ భూమిపై అనుభవం లేని వ్యక్తులకు పట్టా ఇవ్వడంతో ఈభూమికి ఆనుకొని ఉన్న తమ భూములను కూడా ఆక్రమించడమే కాకుండా తమపై ధన,అధికార బలంతో దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

### ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

# 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



**పలమనేరు జనవరి 05,(పెన్ పవర్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ 2025నూతన సంవత్సర డైరీని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనడైరీలో పెన్షనర్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు పెన్షన్ రూల్స్ తేదీలు,తిథి, వారం, పండుగలు ముద్రించడం జరిగిందన్నారు.గత వైస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగ,ఉపాధ్యాయ పెన్షనర్లకు జూలై 2018 నుండి జూలై 2023 వరకు చెల్లించాల్సిన డిఆర్ బకాయిలు, ఏప్రిల్ 2020 నుండి డిసెంబర్ 2021 వరకు చెల్లించాల్సిన పి.ఆర్.సి బకాయిలు దాదాపు 22 వేల కోట్ల రూపాయలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ఉత్తర్వులు సవరించి 70సంవత్సరాలు పూర్తి చేసిన వారికి 10శాతం, 75సంవత్సరాలు పూర్తి అయిన వారికి 15శాతం చెల్లించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడి కొత్త ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సంఘనాయకులు గౌస్, ఆర్ముగం,పి.వి.సుబ్రహ్మణ్యం,ఆంజప్ప,గురుస్వామి నాయుడు, మాలతి, నాగభూషణం, మస్తాని,భద్రమ్మ, అక్బర్ బాషా,ఆదెమ్మ, కుప్పమ్మ, సులోచన, వెంకటేష్, బాలసుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప,గుణశేఖర్, రాజు, మురళి, చక్రపాణిశెట్టి, వేణుగోపాల్, ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో మినీ స్టేడియంకు మహర్దశ

### శారీరక, మానసిక వికాసానికి క్రీడలు అవసరం
### ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వెల్లడి








**కావలి పెన్ పవర్ జనవరి 5**

క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని, యువత క్రీడల వైపు ఆసక్తి చూపాలని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని మినీ స్టేడియంలో కావలి స్పోర్ట్స్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కావలి నియోజకవర్గ మరియు జలదంకి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్టేడియంకు విచ్చేసిన ఎమ్మెల్యే కు టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సరదాగా కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. టాస్ వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో మినీ స్టేడియంకు మహర్దశ పట్టనుందని తెలిపారు. శాప్ అధికారులు రావడం జరిగిందని, స్టేడియంకు అవసరమైన పనుల కొరకు డిపిఆర్ లు తయారు చేయడం జరిగిందన్నారు. స్టేడియంను చదును చేయడానికి, అవసరమైన మట్టి తోలకాలకు సంబందించిన ఖర్చులు తాను భరిస్తానని అన్నారు. వాకర్స్ కు ఇబ్బందులు తలెత్తకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని తెలిపారు. ఎక్కడ చెమట చిందుతుందో అక్కడ విజయం దరి చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టీడీపీ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, మదన్ మోహన్ రెడ్డి, సిద్దు, బుర్లా శ్రీధర్ రెడ్డి, దేవరకొండ శ్రీను, ఆళ్ళ శ్రీను, విక్రమ్ రెడ్డి, మొగిలి కల్లయ్య, కుందుర్తి కిరణ్, రఫీ, దామా మాల్యాద్రి, గంగినేని వెంకటేశ్వర్లు, శానం హరి, జనిగర్ల మనోహర్, పులిమి రామిరెడ్డి, క్రీడాకారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### కావలి జోన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ







**కావలి పెన్ పవర్ జనవరి 5**

కావలి పట్టణంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల నందు కావలి జోన్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభించడం జరిగినది. ఈ యొక్క టోర్నమెంటుకు ముఖ్య అతిథిగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ అయినటువంటి డాక్టర్ శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రీడలు అనేవి ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే ఓటమిలో కూడా కృంగిపోకుండా విజయాన్ని ఎలా చేరుకోవాలని నేర్పిస్తుంది అని మరియు యూనివర్సిటీకి మంచి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కొనియాడారు. ఈ టోర్నమెంట్లో మొదటగా శ్రీ సాయి కళాశాల జట్టు మరియు శ్రీ చైతన్య కళాశాల తలపడగా శ్రీ చైతన్య కళాశాల జట్టు విజయం సాధించాయి. విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి జట్టు మరియు శ్రీ చైతన్య కళాశాల జట్లు తలపడగా విక్రమ సింహపురి కళాశాల కావలి జట్టు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మణికంత, పీడీలు శ్రీనివాసులు, తిరుపాలు,బ్రహ్మయ్య, మరియు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## గౌడ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**కావలి పెన్ పవర్ జనవరి 5**

కావలి పట్టణం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం గౌడ్ సంఘం క్యాలెండర్ ను ఎమ్మెల్యే దగుబాటి వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి డివిజన్ గౌడ్ సంఘం అధ్యక్షులు పంది పెనుగొండ గౌడు,కావలి డివిజన్ గౌడ్ సంఘ ప్రధాన కార్యదర్శి సురగని బ్రహ్మయ్య గౌడు,ఊప్పాల శ్రీనివాసులు గౌడు,కావలి డివిజన్ కార్యదర్శి పట్టణ అధ్యక్షులు తుళ్లూరు శ్రీనివాసులు గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుగబత్తిన సురేష్ గౌడ్,కావలి మండల గౌడ్ సంఘ అధ్యక్షులు తుళ్లూరు వెంకటరమణయ్య గౌడ్, ప్రచార కార్యదర్శి సందు భరత్ గౌడు,కావలి రూరల్ మండల గౌడ్ సంఘ ప్రధాన కార్యదర్శి జంపని పరమేశ్వరరావు, ˇర్ఫూరు మాలకొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



# హైందవ శంఖారావానికి భారీ సంఖ్యలో తరలి వెళ్లిన చీరాల వాసులు



**చీరాల, జనవరి 05, పెన్ పవర్**

హిందూ పరిషత్ చీరాల శాఖ ఆధ్వర్యంలో, సుమారు 1500 మంది పైగా హిందూ బంధువులు, అభిమానులు, కార్యకర్తలు, హైందవ శంఖారా వంకార్యక్రమానికి, చీరాల నుం డి బస్సులు, ఇతర వాహనాల లో, విజయవాడకు భారీ సంఖ్యలో తరలి వెళ్ళారు. ప్రభు త్వ ఆధీనంలో ఉన్న, దేవాదాయ శాఖను రద్దు చేయాలని, దేవాలయాలకు స్వయం ప్రతి పత్తి కలిగించాలన్నదే లక్ష్యంగా, మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మందు, ఈ వినూత్న కార్యక్రమ అంకురా ర్పణ చేయడం జరిగిందని, కార్యక్రమనిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమ నిర్వాహ కులుగా బిజెపి కేంద్ర కార్యవర్గ సభ్యులు బండారుపల్లి హేమం త్ కుమార్, ఆర్.ఎస్.ఎస్., విశ్వ హిందూపరిషత్, బీజేపీ సభ్యు లు గుగ్గిలం తులసి రావు, కొర్ని పాటి మహేష్, ప్రసాద్,చుండూ రు అశోక్, గౌరాబత్తిని నాగ రా జు, బీజే వైఎం బాపట్ల అధ్యక్షులు నాశన మణికుమార్, బీజే వైఎం బక్కా మనోహర్ రెడ్డి, బీజేపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు, బిజెపి కేంద్ర కార్య వర్గ సభ్యులు మువ్వల వెంకట రమణా రావు, ఏపీ బీజేపీ ఓబీసీ సభ్యులు నాసిక శివాజీ, బిజెపి చీరాల పట్టణ అధ్యక్షులు శంకర్ శెట్టి నాగేశ్వ రరావు, బిజెపి చీరాల అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, భరణీ రావు, బిజెపి జిల్లా నాయ కులు తడవర్తి చంద్ర, దేవాంగ సంక్షేమ బాపట్ల జిల్లా సెక్రటరీ యారాసు అరుణ్ బాబు, బీజే పీ మహిళా మోర్చా గుద్దంటి భవాని, పెరుమాళ్ళ వేణు మా ధవ్, తదితరులు వ్యవహరించారు.

## స్త్రీ విద్యా ప్రదాయిని సావిత్రిబాయి పూలే



**కందుకూరు పెన్ పవర్, జనవరి 5**

భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు కందుకూరు కాలేజీ బాలికల హాస్టల్ బీసీ లో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బి టి ఏ)ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీఏ జిల్లా మహిళ కార్యదర్శి ఏ అరుణ కుమారి మాట్లాడుతూ సావిత్రిబాయి స్త్రీ హక్కుల కోసం మహిళా విద్య కోసం విశేషంగాచేసిన కృషి ఫలితంగానే నేడు మహిళలు చదువులోనూ ఉద్యోగాల్లోనూ వ్యాపారంలోనూ రాజకీయంలోనూ సమస్త రంగాలలో రాణిస్తున్నారని ఆమె పోరాటమే మహిళల అభివృద్ధికి పునాది అయ్యిందని తెలిపారు. డివిజన్ మహిళా కార్యదర్శి సుభాషిని మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆమె భర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఇద్దరు కలిసి పేద ప్రజల కొరకు విద్యాలయాలు అనాధాశ్రమాలు వృద్ధాశ్రమాలు తోపాటు విద్య లేనందున విజ్ఞానం లేకుండా పోతుందని దానివలనే ప్రజలు వెనక పడుతున్నారని భావించి అనేక విజ్ఞాన కేంద్రాలు స్థాపించి నడిపించారని చెప్పారు. సీనియర్ ఉపాధ్యాయుని షర్మిల మాట్లాడుతూ సావిత్రిబాయి జీవిత చరిత్రని పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టాలని సావిత్రిబాయి జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. వాణి సుబ్బరత్నం మాట్లాడతూ సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకొని అందరూ మంచి పౌరులుగా సేవకులుగా ఎదగాలని కోరారు. అనంతరం హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థినీలకు కందుకూరు బాలికలు ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేయుచున్న సమతా మేడం గారు రైటింగ్ ప్యాడ్స్ స్వీట్స్ పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులు సమతా ని హాస్టల్ హెచ్ డబ్ల్యు ఓ హుస్సేనీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ మునంగి రమేష్ మహిళా కార్యదర్శులు మంగమ్మ కవిత సుకన్య డివిజన్ అధ్యక్షులు అబ్దుల్లా కరేటి వెంకటేశ్వర్లు మోహన్ రావు పాల్గొన్నారు.

## పల్లపోలు సాంబయ్య 32వ వర్ధంతి





**వేటపాలెం, పెన్ పవర్, జనవరి 05**

రాష్ట్ర సోషలిస్ట్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షునిగా పనిచేసిన పల్లపోలు సాంబయ్య 32వ వర్ధంతి సందర్భంగా వేటపాలెం మండల పంచాయితీలో గల ఆయన విగ్రహానికి వారి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు నాగ మనోహర్ లోహియా మాట్లాడుతూ మా నాన్నగారి అడుగుజాడల్లో నడిచానని,ఆయన ఆశయాలు కొనసాగిస్తామని, గతంలో బాపట్ల పార్లమెంటుకు పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచారని ఆయన గొప్పప్రజాదరణ గల వ్యక్తిఅని ఆయనను కొనియాడారు. వేటపాలెం మున్సిపాలిటీ ని రద్దు చేయించడంలో ప్రధమ పాత్ర వహించాడని, మోటుపల్లి ఎత్తిపోతల పథకం సాధించటం గొప్ప గర్వకారణం ఈ సందర్భంగా విశాలాంధ్ర విలేఖరి గుడిమోటి అశోక్ కుమార్ కు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వసంతకుమారి సిపిఎం మహిళా ప్రతినిధి, విజయనిర్మల, ఉష, సింధు, ఎస్.కె షరీఫ్ సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన వ్యవసాయ మార్కెటింగ్ పాలసీ రైతుల పాలిటి శాపం

## రావుల వెంకయ్య




**కందుకూరు పెన్ పవర్, జనవరి 5**

ఈ నెల 4వ తేదీన హర్యానాలోని టోకోనాలో రైతుల మహా పంచాయితీ జరిగింది. రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుండి 20వేల మందికి పైగా రైతులు హాజరైనారు. ఈ మహా పంచాయతీలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు దర్శన పాల్ సింగ్, సత్యవాన్, కృష్ణ ప్రసాద్ తదితర నాయకులు మాట్లాడారు. సభకు హర్యానా రాష్ట్రానికి చెందిన వివిధ రైతు సంఘాల నాయకులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సభలో రైతులను ఉద్దేశించి ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నూతన వ్యవసాయ మార్కెటింగ్ పాలసీని తెచ్చారని, అది రైతుల పాలిట అత్యంత ప్రమాదకరం అని అన్నారు. ఇది అమలు జరిపి మార్కెటింగ్ సొసైటీని రద్దుచేసి కార్పోరేట్ శక్తులను కట్టబెట్టాలని కేంద్రం చూస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నా, కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవాలని చూస్తుందన్నారు. అదే జరిగితే మన ఫెడరల్ వ్యవస్థకి బంగం వాటిల్లుతుందన్నారు. ఈ చట్టం గతంలో తెచ్చిన మూడు నల్ల చట్టాల కన్నా దారుణమైనదని అన్నారు. ఆనాడు నల్ల చట్టాలను రద్దు చేయడానికి 13 నెలల పాటు దేశవ్యాప్తంగాను, ఢిల్లీ సరిహద్దులలోనూ సుదీర్ఘ పోరాటం జరిగిందన్నారు. ఆ పోరాటంలో 545 రైతు సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక తాటి మీదకు వచ్చి పోరాడారన్నారు. ప్రపంచంలోనే అలాంటి రైతాంగం పోరాటానికి పెద్ద గుర్తింపు వచ్చింది అన్నారు. అది ఒక చారిత్రాత్మకమైన రైతు ఉద్యమం అన్నారు. ఆ పోరాటంలో 740 మంది రైతు బిడ్డలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇంకా ఇప్పటికి నాలుగు వేలకు పైగా కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. చివరకు నరేంద్ర మోడీ దిగివచ్చి ఆ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవడమే కాకుండా యావత్ రైతు జాతికి క్షమాపణ చెప్పారన్నారు. ఆనాడు రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలలో మద్దతు ధర, రుణమాఫీ, విద్యుత్ బిల్లు ఉపసంహరణ ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాలు దాటిన అవి అమలుకు నోచుకోలేదన్నారు. ఈ సందర్భంలో రైతు నాయకుడు దలైన్ వాలా ఈ డిమాండ్ల మీద 45 రోజులకు పైగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ చావు బతుకుల మధ్య ఉన్నారన్నారు. అయినా ఈ ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదన్నారు. ఇప్పుడు మరలా గోరుచుట్టు మీద రోకలి పోటులా నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీని ఉపసంహరణకు మరో మారు దేశవ్యాప్తంగా పోరాటానికి రైతులు సిద్ధం కావాలన్నారు. హర్యానా, పంజాబ్ లలో నేడు జరుగుతున్న మహా పంచాయతీలను మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కూడా జరిపి రైతు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

# రైతుల కడుపు కొట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం విధానాలు -కేవివి ప్రసాద్



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం జనవరి 5**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా నూతన మార్కెటింగ్ చట్టాన్ని తీసుకురావడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక మల్లయ్య లింగం భవన్లోని రైతు సంఘం కార్యాలయంలో వి హనుమారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించమని అడిగితే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులపై పాసవికంగా దాడి చేస్తుందని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాల రద్దు సమయంలో ఇచ్చిన హామీ మేరకు డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పంజాబ్ రైతు నాయకులు దలేవాల్ గత 43 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ ఉంటే మానవత్వం లేని కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దీక్ష భగ్నం చేయటానికి ప్రయత్నిస్తా ఉంది. సుప్రీం కోర్టు దలేవాల్ ప్రాణాలకు రక్షణ కల్పించాలని సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయినా నరేంద్ర మోడీ విధానాల్లో మార్పు లేదు. దీనికి నిరసనగా ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రూపాలలో ఆందోళనలు జరిగాయి. కొనసాగింపుగా నిన్న హర్యానాలో లక్షలాదిమంది తోటి సభ జరిగింది. తదుపరి కార్యాచరణ రూపొందించుకొనుటకు ఈనెల 8వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందిస్తాయని ప్రసాద్ అన్నారు. మన రాష్ట్రంలో తుఫాన్ల కారణంగా అనేక జిల్లాలలో పంటలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. పంటలు నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తుల పనులు త్వరగా పూర్తి చేయాలని, కొండపి నియోజకవర్గం లోని పాలేరు సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవసాయ అధికారులు పంట నష్ట అంచనాలు తయారు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు రామయ్య, కొండయ్య, బాల్ రెడ్డి, బాలకోటయ్య, వెంకట్రావు, సాంబశివరావు, బాలాజీ రెడ్డి, వాసు, అంజయ్య, ప్రసాదు మొదలగువారు పాల్గొన్నారు.

## శాంతి, సహనం, సౌభ్రాతృత్వాలకు కేంద్రంగా ఉన్నందునే భారతదేశాన్ని ప్రపంచం గౌరవిస్తోంది - పుల్లారావు



**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 05**

సర్వ మతాల సమూహమైన భారతదేశం, శాంతి, సహనం, సౌభ్రాతృత్వాలకు కేంద్రబిందువుగా నిలవడం భారతీయులందరూ గర్వించాల్సిన విషయమని, మనదేశ సంస్కృతీ సంప్రదాయాలు,మనలోని ఐకమత్యాన్ని చూసే మన దేశాన్ని ప్రపంచదేశాలన్నీ గౌరవిస్తున్నాయని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటిపుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో ఆదివారం ఆయన హైందవ శంఖారావం పేరిట విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో జరుగుతున్న భారీ బహిరంగసభకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేవాలయాల పరిరక్షణతో పాటు, వాటికి స్వయం ప్రతిపత్తి కల్పించాలనే సదుద్దేశాన్ని తెలియచేస్తూ నిర్వహిస్తున్న సభకు వెళ్లే వారందరూ చిత్తశుద్ధి, దీక్షతో ఉండాలని, ఆవేశకావేశాలకు లోను కాకుండా శాంతి, సహనంతో వ్యవహరించాలని మాజీ మంత్రి సూచించారు.

## పలువురు పార్టీ నేతలకు నివాళులు అర్పించిన : ప్రత్తిపాటి





**చిలకలూరిపేట పెన్ పవర్ ప్రతినిధి జనవరి 05**

చిలకలూరిపేట పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజి కౌన్సిలర్ గుద్దంటి తాండవ కృష్ణ తల్లి గారైన గుద్దంటి ఉమా మహేశ్వరమ్మ మృతి చెందడం జరిగింది, వారి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించరు, తదుపరి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పాత 20వ వార్డ్ మాజి కౌన్సిలర్ సయ్యద్ కరిముల్లా ( కట్టర్ ) మృతి చెందగా, వారి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి, అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7 నుండి విద్యుత్ చార్జీల ప్రతి పాదన (టారిఫ్) లపై ప్రజాభి ప్రాయ సేకరణ

**వివరాలు వెల్లడించిన విద్యుత్ శాఖ ఈ.ఈ. కె.జాన్ థామస్ వినియోగదారులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలుపాలని విజ్ఞప్తి**

**7, 8 తేదీలలో విజయవాడ లో, 10వ తేది కర్నూల్ లో ప్రజాభిప్రాయ సేకరణ**

**చీరాల, జనవరి 05, పెన్ పవర్**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈ ఆర్ సి), ఈనెల 7, 8, 10 తేదీ లలో, 2025 - 26 ఆర్థిక సంవ త్సరానికి అమలు చేయుచు న్న, విద్యుత్ చార్జీల(టారీఫ్) ప్రతిపాదనలపై, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు, విద్యుత్ శాఖ ఈ.ఈ. కె.జాన్ థామస్ తెలిపారు. ఈనెల 7, 8 తేదీలలో, విజయవాడ బృం దావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో, తదుపరి పదవ తేదీ కర్నూలు లోని ఏ పి ఈ ఆర్ సి కార్యాలయంలో, ఉదయం భౌతికంగా మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సేకరణ జరుగునని, సమావేశంలో వివరాలు వెల్లడించారు. కావున వినియోగదారులు ఎవరైనా, తమ అభ్యంతరాలు లేదా అభిప్రాయాలను తెలియ జేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చీరాల ఏ.డి.ఈ. బి. హరి ప్రసాద రావు, విద్యు త్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా విస్తృత పర్యటన





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 05**

ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదివారం ప్రకాశం జిల్లాలోని మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాల పాడు గ్రామం, ఒంగోలులో విస్తృతంగా పర్యటించారు. తొలుత మద్దిపాడు మండల కేంద్రంలోని మాదిగ పల్లె కాలనీని సందర్శించిన ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, ఆ కాలనీ వాసులతో ముఖాముఖి మాట్లాడి వారి జీవన పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారివారి సమస్యలను కమీషన్ ఛైర్మన్ కు విన్నవించుకుని అర్జీలను అందచేశారు. అనంతరం మద్దిపాడులోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించి పిల్లలు ఎలా చదువుకుంటున్నారు, వసతులు ఎలా కల్పిస్తున్నారు. బోధన విధానాలను గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంట గదిని, మెనూ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విద్యార్థులతో మమేకమై వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి, పిల్లలతో పాఠ్యాంశాలు చదివించారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించి వారితో ఫోటో దిగారు. అనంతరం ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, నాగులుప్పలపాడు మండలం, మద్దిరాల పాడు గ్రామంలోని ఎస్.సి కాలనీని సందర్శించి ప్రతి వీధిని తిరిగి కాలనీ వాసులతో ముఖాముఖి మాట్లాడి వారి జీవన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారివారి సమస్యలను కమీషన్ ఛైర్మన్ కు విన్నవించుకునిఅర్జీలను అందచేశారు. తదుపరి ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ ఒంగోలు లోని భాగ్యనగర్ లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం 2,3 లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ వివరాలు, వసతి సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమైన ఛైర్మన్, వసతి గృహంలో అందుతున్న



వసతులు, భోజన వసతులు తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మి ప్రసన్న, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, సంబంధిత మండలాల తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సభలు





**దొనకొండ జనవరి 05 పెన్ పవర్**

మండల కేంద్రంలో అంబేద్కర్ బొమ్మ సర్కిల్లో ఆనందాశ్రయంలో విజయవాడ గన్నవరం లో నిర్వ హించే హైందవ శంఖారావం సభకి దొనకొండ మండలం అన్ని గ్రామాల నుండి హిందూ బంధు వులు అందరూ తెల్లవారుజామున 5 గంటలకి ఆనంద ఆశ్రమం చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు చేసి ఉదయం 6 గంటల నుండి



రెండు బస్సుల్లో విజయవాడ సభకు బయలుదేరి వెళ్లారు మధ్యాహ్నం 12 గంటలకు సభా కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం నాలుగు గంటల నుండి తిరుగు ప్రయాణం అయినట్టు శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఆర్ఎస్ఎస్ ప్రముఖులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఏర్పాటు చేశారన్నారు.

## షేక్ రహీంబాషా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసిన టిడిపి నాయకులు




**పెన్ పవర్ పామూరు జనవరి 05**

పట్టణంలో ఎర్రచేలు కాలనీ నందు ఆదివారం షేక్ రహీంబాషా 42 అనారోగ్యంతో బాధపడుతున్న మంచానికి పరిమితయ్యాడు విషయం తెలుసుకున్న వెంటనే పట్టణ టీడీపీ ముస్లిం నాయకులు పట్టణ టిడిపి ప్రముఖ నాయకులు దాతల సహకారం తో 50,000- రూపాయల నగదును యారవ శ్రీనువాసులు వారి చేతుల మీదుగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్యకర్తలకు టిడిపి పార్టీ అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తోంది అని అన్నారు. కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్ ,షేక్ మొబీనా మౌలాలి, సిపిఎం నాయకులు ,షేక్ మస్తాన్ ,షేక్ ఆర్ఆర్ రఫీ, షేక్ ఖజా రహమతుల్లా, పిడుగు శ్రీనివాసులు, గుత్తి మహేష్, షేక్ సుభాని, వాయినేని రాఘవ, పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు సహ చట్టం తెలియ చేయండి: సలగల



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 5:**

అణగారిన వర్గాలకు సమాచార హక్కు చట్టం గురించి తెలియ జేసి వారి అభ్యున్నతికి పాటుపడాలని బావుడా ఛైర్మన్,తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం బాపట్ల విచ్చేసిన ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ బావుడా ఛైర్మన్ సలగల ను ఆయన స్వగృహం లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సలగల మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై, హ్యూమన్ రైట్స్,లోకాయుక్త పై పేద ప్రజలకు అవగాహన కల్పించటం హర్ష నీయమన్నారు. అదే విధంగా పలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థ కార్యకర్తలు నీతి నిజాయితీ గా వ్యవహరిస్తూ ప్రజల్లో మంచి స్ఫూర్తిని నింపుతున్నారని కొనియాడారు. చంద్రమోహన్ మాట్లాడుతూ తమ సంస్థ రాజ్యాంగ పరిరక్షణకై, ప్రజల సమానత్వం కోసం, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలసి కృషి చేస్తున్నదని చెప్పారు. అవినీతిని అరికట్టేలా యువత కు తమ సంస్థ తగిన శిక్షణ ఇస్తున్నదని వివరించారు. చంద్రమోహన్ వెంట బాపట్ల నూతన జిల్లా మద్దిబోయిన అమృత రాజు తదితరులు పాల్గొన్నారు.

# 3 నెలల్లో తీసుకునే అప్పుల్లో తెలుగు ప్రభుత్వాల లెక్కేంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** జనవరి నుంచి మార్చివరకు రానున్న మూడు నెలల్లో దేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు బహిరంగ మార్కెట్ నుంచి తీసుకునే అప్పుల లెక్క ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అంతకంతకూ అప్పులు తీసుకోవటం అలవాటుగామారిన రాష్ట్రాలు.. సంక్షేమ పథకాల కోసంభారీగా ఖర్చులు చేస్తున్నాయి. మార్చితో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. రానున్న మూడు నెలల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలు కలిపి తీసుకునే రుణాలు రూ.4.73 లక్షల కోట్లు కావటం గమనార్హం. దీనికి సంబంధించిన వివరాల్ని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అన్ని రాష్ట్రాలు కలిపి జనవరిలో రూ.1.47 లక్షల కోట్లు.. ఫిబ్రవరిలో 1.51 లక్షల కోట్లు.. మార్చిలో రూ.1.74 లక్షల కోట్లను అప్పుగా తీసుకోన్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల అప్పుల లెక్కేమిటంటే.. ఏపీతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం భారీగా అప్పులు తీసుకోనుంది. రానున్న మూడు నెలల్లో తెలంగాణ రూ.30వేల కోట్లు తీసుకోనుండగా.. ఏపీ రూ.11 వేల కోట్ల మేర అప్పు చేయనున్నాయి. తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే జనవరి.. ఫిబ్రవరి.. మార్చి నెలల్లో ప్రతి నెలా రూ.10వేల కోట్ల చొప్పున అప్పు తీసుకోనున్నారు. ఏపీ సైతం జనవరిలో రూ.4వేల కోట్లు.. ఫిబ్రవరిలో రూ.5వేల కోట్లు.. మార్చిలో రూ.4వేలకోట్లు తీసుకున్నట్లుగా ఆర్ బీఐ షెడ్యూల్ ను విడుదల చేసింది.



ఈ మూడు నెలలకు 12 వారాల్లో ఏ వారం ఏ రాష్ట్రం ఎంత అప్పు తీసుకునే జాబితాను విడుదల చేసింది. అందులో తెలంగాణ ప్రతి వారం అప్పు చేసేందుకు వీలుగా షెడ్యూల్ సిద్ధం చేసుకుంటే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం మొత్తం 12 వారాల్లో ఆరు వారాల్లోనే రుణాల్ని తీసుకోవాలని డిసైడ్ అయ్యింది. అంతకంతకూ పెరుగుతున్న అప్పులు భారంపై ప్రజల్లో అవగాహన పెరగటంతో పాటు.. వాటిని ప్రభుత్వాలు సమర్థంగా వినియోగిస్తున్నాయా? లేదా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.

# రేవంత్ వారి రైతుభరోసా వచ్చేసింది.. కీలక అంశాలేమంటే?






**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఒక అంశంపై తరచూ ఆసక్తికర చర్చ నడుస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధును రేవంత్ సర్కారు కంటిన్యూ చేస్తుందా? లేదా? అని. గత ప్రభుత్వం ఏకరానికి రూ.10వేలు చొప్పున ఇస్తే.. తమ పాలనలో ఎకరానికి రూ.12వేలు ఇస్తామని చెప్పిన రేవంత్.. తమ ప్రభుత్వ హయాంలో అలాంటి ప్రకటన ఏమీ చేయకపోవటంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. శనివారం ముగిసిన మంత్రివర్గ సమావేశం అనంతరం.. రైతు భరోసాపై కీలక ప్రకటన చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరానికి రూ.10వేలు ఇస్తే.. తమ ప్రజాపాలనలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2వేలు అదనంగా పెంచి అందరికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. భూములున్న వారికి రైతుభరోసా వస్తుందని.. భూములు లేని వారికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఇస్తామని వెల్లడించారు. తండాలు.. గూడెల్లోని వ్యవసాయ రైతుకుటుంబాలకు భూమి లేకపోవటం శాపమవుతుందని.. అలాంటి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు రేవంత్ రెడ్డి. తాను.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనలకు వెళ్లినప్పుడు ఈ విషయాన్ని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పిన సీఎం రేవంత్.. 'భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించాం. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంగా నామకరణం చేస్తున్నాం" అని చెప్పారు. అదే సమయంలో తాము అందించే రైతు భరోసాకు పరిమితుల్ని చెప్పేశారు సీఎం రేవంత్.

రాళ్లూరప్పలు.. కొండలు.. గుట్టలు.. స్థిరాస్తి వెంచర్లు.. రహదారులు.. నివాస.. పారిశ్రామిక.. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే భూములు.. నాలా మార్పిడి చేసినవి.. వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం సేకరించిన.. వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతు భరోసా వర్తించదని ముఖ్యమంత్రి తేల్చేశారు. ఈ సమాచారాన్ని గ్రామసభలు నిర్వహించి ప్రజలకు వివరిస్తారన్నారు.

రైతుల నుంచి ఎలాంటి దరఖాస్తుల అవసరం లేకుండానే రైతుభరోసాను చెల్లించాలని డిసైడ్ చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూమికే ఇవ్వాలన్న నిర్ణయం నేపథ్యంలో.. మళ్లీ దరఖాస్తు చేయాలా? అన్న సందేహానికి బదులు చెబుతూ.. ఆ అవసరం లేదని తేల్చారు.రెవెన్యూ రికార్డులు.. ధరణి లోపాల కారణంగా పరిశ్రమలకు.. స్థిరాస్తి భూములు.. ప్రభుత్వం సేకరించిన భూములకు రైతుబంధు ఇచ్చినట్లుగా చెప్పిన సీఎం.. రైతుభరోసాలో అలా జరగదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగానే రైతుభరోసా కోసం సాయాన్ని రూ.10వేల నుంచి రూ.12 వేలకు పెంచామని.. భూమిలేని పేదలకు రూ.12 వేలు ఇస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు. ఆదాయ వనరులు పెంచటం.. పేదలకు పంచటమే తమ ప్రభుత్వ విధానంగా ముఖ్యమంత్రి రేవంత్ చెప్పుకోవటం గమనార్హం.

# పదేళ్ల మోడీ జమానాలో జరుగుతున్నదేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాదికి మూడుసార్లు నిర్వహించే పార్లమెంటు సమావేశాలకు సంబంధించి.. అంతకంతకూ తగ్గుతున్నచర్చల సారం ఆందోళనకు గురి చేస్తుందని చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పార్లమెంట్ కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉంది. గడిచిన రెండు దశాబ్దాలుగా ఆ తీరులో మార్పు వచ్చింది. గడిచిన పదేళ్లలో అయితే.. ఈ తీరులో మరింత తేడా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. దీంతో.. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా అరుపులు.. కేకలు.. దూషణలు.. తోపులాటలే తప్పించి.. లోతైన చర్చలు.. చట్టాలుగా చేసే అంశాలపై వాదనలు లాంటివి అంతకంతకూ తగ్గుతున్న దుస్థితి. ఇందుకు 18వ లోక్ సభ శీతాకాల సమావేశాలే నిదర్శనంగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాల్లో అత్యంత కీలకమైనది ప్రశ్నోత్తరాల సమయం. ఇది నానాటికి తగ్గిపోతోంది. ఇక్కడో విషయాన్ని ప్రస్తావించాలి. పార్లమెంట్ బిజినెస్ లో ఇతర అంశాల కోసం అదనపు గంటలు పని చేసే వెసులుబాటు ఉంటుంది కానీ ప్రశ్నోత్తరాలు వాయిదా పడితే ఆ టైంను పొడిగించరు. అందుకే.. ప్రశ్నోత్తరాల సమయాన్ని సభ్యులు నూటికి నూరు శాతం వినియోగించాల్సిన అవసరం ఉంది. బ్యాడ్ లక్ ఏమంటే.. ప్రశ్నోత్తరాల టైం తగ్గిపోతోంది. 16వ లోక్ సభలో ప్రశ్నోత్తరాల కోసం నిర్దేశించిన వ్యవధిలో కేవలం 77 శాతం.. అదే విధంగా రాజ్యసభలో 44 శాతమే వినియోగించటం చూస్తే.. విలువైన సమయం ఎలా వృధా అవుతుందన్న విషయం అర్థమవుతుంది. ప్రశ్నోత్తరాల టైంను కొత్తగా ఎన్నికైన సభ్యులు ఎక్కువగా వినియోగించుకుంటారు. ఇంత పెద్ద దేశంలో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలకు సంబందించిన ప్రశ్నలు వేసి వాటికి జవాబులు ఆశిస్తారు. ప్రశ్నోత్తరాల టైం రద్దు అయితే.. సభ్యులు తమకు ఉన్న విలువైన అవకాశాన్ని కోల్పోతారన్నది వాస్తవం.

మన పార్లమెంట్ వ్యవస్థలో.. నానాటికి చర్చలుజరిగే తీరు తగ్గుతుంది. దీన్ని అధికార పక్షం వారు ఒకలా.. విపక్షాలు మరోలా వ్యవహరిస్తున్నాయి. మొత్తంగా సభను సజావుగా జరిపే కన్నా.. తమ రాజకీయ బలాన్నిప్రదర్శించే వేదికలుగా పార్లమెంట్ ను మార్చేసుకోవటం అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఈ ధోరణి మోడీ అధికారంలో ఉన్న పదేళ్లలో మరింత ఎక్కువైందన్న విమర్శ ఉంది. తాజాగా ముగిసిన శీతాకాల సమావేశాల్నే తీసుకుంటే.. రాజ్యసభ ఛైర్మన్.. ఉప



రాష్ట్రపతి జగ్ దీప్ ధన్కడ్ పై విపక్షం అవిశ్వాస తీరమానం ప్రవేశ పెట్టటానికి ఇచ్చిన నోటీసును డిప్యూటీ ఛైర్మన్ తిరస్కరించటంతోగందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో రాజ్యసభ వాయిదా పడింది. కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానించారంటూ విపక్ష సభ్యులు గందరగోళాన్ని క్రియేట్ చేయటమే కాదు.. చివరకు అధికార.. విపక్షాల మధ్య తోపులాటలు.. ముష్టిఘాతాల వరకు వెళ్లటం చూస్తే.. పార్లమెంట్ సభలు ప్రజల సమస్యల మీద చర్చ జరగటానికా? అధికార.. విపక్షాల బలాన్ని ప్రదర్శించేందుకా అన్నది ప్రశ్నగా మారింది.సభను సజావుగా జరిపేందుకు అధికారపక్షం కాస్త తగ్గటం.. అదే సమయంలో విపక్షాలు హుందాగా వ్యవహరించటం తగ్గిపోయింది. దీంతో.. సభా సమయంలో అనూహ్య పరిణామాలకు వేదికగా మారుతోంది. నిజానికి శీతాకాల పార్లమెంట్ సమావేశాలకు భారీ ఎజెండానే సిద్ధం చేశారు. మొత్తం 16 బిల్లులు ప్రవేశ పెట్టి.. మెజార్టీ బిల్లుల్ని ఆమోదించాలని భావించారు. కానీ.. విమానయాన రంగానికి సంబంధించిన భారతీయ వాయుయాన్ విధేయక్ 2024 బిల్లు ఒక్కటి మాత్రమే ఉభయ సభల ఆమోదం పొందింది.

దేశ ఎన్నికల స్వరూపాన్ని మార్చేసే జమిలి ఎన్నికలకు సంబంధించి 129వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టి దాన్ని జేపీసీకి పంపారు. దేశ ప్రయోజనాలకు అవసరమైన అంశాల విషయంలో సభ ఏకాభిప్రాయానికి రావాల్సి ఉండగా.. కీలక అంశాలపైకూడా అధికార.. విపక్షాలు ఒక తాటి మీదకు రాలేని పరిస్థితి. ఈ విషయంలో అందరికి పెద్దన్నలా వ్యవహరించాల్సిన మోడీ.. ఆ పాత్రను పోషించే విషయంలో అడ్డంగా ఫెయిల్ అయ్యారన్న విమర్శ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. ఈ తీరు మారాలి. అందుకు ప్రభుత్వమే నడుం బిగించాలి. అందరిని కలుపుకుపోయేలా సంకేతాలు ఇవ్వటం.. పార్లమెంట్ లో సజావుగా చర్చలుజరగటానికి అవసరమైన కసరత్తు తెర వెనుక కూడా సమర్థంగా సాగాలి. లేదంటే.. విలువైన ప్రజాధనం వేస్టు కావటమే కాదు.. చర్చలు జరగకుండానే బిల్లులు కాస్తా చట్టాలుగా మారితే అది దేశ ప్రజలకే నష్టం కలిగిస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు.

## కుంభమేళ సిత్రాలు: 32 ఏళ్లుగా స్నానం చేయలేదు.. తలపై బార్లీ సాగు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహా కుంభమేళ కోసం దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బాబాలు.. సాధువులు.. అఘోరాలు ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ కు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా కొందరు బాబాలు.. సాధువులు అమితంగా ఆకర్షిస్తుంటారు. అలాంటి ఇద్దరికి చెందిన విశేషాల్ని చూస్తే.. వీరిలో ఒక బాబా గత 32 ఏళ్లుగా స్నానమే చేయలేదు. మరో బాబా తల మీద ఏకంగా బార్లీని పండిస్తున్నారు. వీరిద్దరూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. 32 ఏళ్లుగా స్నానం చేయని బాబా పేరు ఛోటూ బాబా. ఆయన అసలు పేరు గంగాపురి మహరాజ్. అసోంలోని కామాఖ్య పీఠానికి చెందిన ఆయన ఎత్తు కేవలం 3.8 అడుగులు మాత్రమే. ఆయన వయసు 57 ఏళ్లు. గడిచిన 32 ఏళ్లుగా ఆయన స్నానం చేయలేదు. తానో కోరిక కోరుకున్నానని.. అది తీరే వరకు స్నానం చేయకూడదని నిర్ణయించుకున్నట్లుగా చెప్పిన ఆయన.. తన కోరిక ఏమిటో మాత్రం వెల్లడించలేదు.ఆత్మ పరమాత్మతో అనుసంధానం అవుతుందని.. అందుకే తాను మహా కుంభమేళకు వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. సాధువుగా మారి గడిచిన ఐదేళ్లుగా తలపై బార్లీ సాగు చేస్తున్న ధాన్ వాలే బాబా సోషల్ మీడియాలో ప్రముఖంగా ఉంటారు. ఆయన తీరు భిన్నంగా ఉంటుంది. అందుకే ప్రయాగ్ రాజ్ లో ఆయన ప్రముఖంగా కనిపిస్తారు. ఆయన్ను అందరూ గుర్తిస్తారు. ఆయన అసలు పేరు అమర్ జీత్. కెమికల్స్ తో పండించిన ఆహార పదార్థాలతో మనుషుల అనారోగ్యం పాలవ్వుతన్నారని.. అందుకే ప్రకృతి సిద్ధమైన సాగు మీద అవగాహన కల్పించటం కోసం ఆయనీ విచిత్రమైన పని చేస్తుంటారు. తల మీద బార్లీ సాగు చేసే ఆయన.. పడుకునే విధానం ఎలా ఉంటుందన్న సందేహం పలువురికి వస్తుంది.

## ఉబర్ ఇండియాకు రూ.54వేల ఫైన్.. ఎందుకో తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉబర్ ఇండియాకు వినియోగదారుల కోర్టు ఫైన్ షాకిచ్చింది. వినియోగదారులకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినందుకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ తరహాలో నిత్యం పలువురికి సమస్యలు ఎదురవుతున్నా.. చాలామంది పట్టించుకోరు. కానీ.. అందుకు భిన్నంగా ఒకరు మాత్రం ఈ ఇష్యూను సీరియస్ గా తీసుకున్నారు. దీనికి ఫలితంగా వినియోగదారుల కోర్టు ఫిర్యాదుదారుకు ఊరట కలిగించే ఆదేశాల్ని జారీ చేశారు. అసలేం జరిగిందంటే..సౌత్ ఢిల్లీకి చెందిన ఒక డాక్టర్ 2021 నవంబరు 29న ఇండోర్ వెళ్లేందుకు ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నారు. ఉదయం 3.15 గంటలకు ఎయిర్ పోర్టు వెళ్లేందుకు ఉబర్ క్యాబ్ బుక్ చేసుకున్నారు. ఎంతసేపటికి క్యాబ్ రాకపోవటంతో డ్రైవర్ కు ఫోన్ చేశారు. కానీ.. డ్రైవర్ రియాక్టు కాలేదు. దీంతో ఉబర్ కస్టమర్ కేర్ కు కంప్లైంట్ చేసినా ఫలితం లేకపోయింది.దీంతో మరో క్యాబ్ బుక్ చేసుకొని ఎయిర్ పోర్టుకు చేరుకోగా.. అప్పటికే ఫ్లైట్ వెళ్లిపోయింది. దీంతో తనకు జరిగిన నష్టం గురించి వినియోగదారుల కోర్టులో కేసు వేశారు. దీనిపై విచారణ చేసిన కోర్టు.. ఉబర్ ఇండియాకు రూ.54 వేలు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరో ఫ్లైట్ టికెట్ కోసం పెట్టిన రూ.24 వేలు.. మానసిక క్షోభకు గురి చేసినందుకు రూ.30 వేలుచెల్లించాలని ఉబర్ ను ఆదేశించింది. ఈ తరహాలో క్యాబ్ ఆపరేటర్ల కారణంగా చేదు అనుభవాలు ఎదురైతే.. ఎవరికి వారు బాధపడే కన్నా వినియోగదారుల కోర్టును ఆశ్రయించటం మంచిది.

## చలికాలంలో ఎక్కువగా తలనొప్పి వస్తోందా.. ఈ టిప్స్ ఫాలో అయితే క్షణాల్లో రిలీఫ్ వస్తుంది..

**హైదరాబాద్ పెన్ పవర్:** చలికాలంలో తరచూ తలనొప్పి వస్తోందంటూ చాలామంది కంప్లైంట్ చేస్తూ ఉంటారు.. మైగ్రెన్, సైనస్ వంటి ప్రాబ్లమ్స్ ఉన్నోళ్లకు సహజంగానే చలికాలంలో సమస్య ఎక్కువవుతూ ఉంటుంది. మరోవైపు చలికాలంలో పొద్దున్నే లేవడానికి చాలామంది ఇష్టపడరు.. లేట్ గా లేద్దాం అనుకుంటారు కానీ.. పనుల వల్ల ఉదయాన్నే లేవాల్సి వస్తుంది. దీనివల్ల స్లీప్ ప్యాటర్న్ డిస్టర్బ్ అయ్యి తలనొప్పి వస్తుంది. ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతుంటారు. అయితే.. కొన్ని టిప్స్ ఫాలో అవ్వడం వల్ల చలికాలంలో వచ్చే తలనొప్పి నుండి రిలీఫ్ పొందవచ్చు... అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**చలికాలంలో వచ్చే తలనొప్పిని దూరం చేసే చిట్కాలు:**

**హీటింగ్ ప్యాడ్ వాడటండి:**

హీటింగ్ ప్యాడ్స్ వాడటం వల్ల చలికాలంలో వచ్చే తలనొప్పి నుండి త్వరగా రిలీఫ్ పొందవచ్చు. చలి తలనొప్పి వచ్చినప్పుడు తలపై కొద్దిసేపు హీటింగ్ ప్యాడ్ పెట్టడం వల్ల త్వరగా రిలీఫ్ వస్తుంది.. అంతే కాకుండా మెడ, భుజాలపై హీటింగ్ ప్యాడ్ పెట్టుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

**మసాజ్ థెరపీ:**

చలి వల్ల వచ్చే తలనొప్పికి మసాజ్ థెరపీ మంచి రెమిడీ అని చెప్పచ్చు. తలనొప్పి వచ్చే ట్రిగర్ పాయింట్ దగ్గర మసాజ్ చేస్తే క్షణాల్లో నొప్పి మాయమై రిలీఫ్ వస్తుంది. మసాజ్ వల్ల తలనొప్పి మాత్రమే కాకుండా స్ట్రెస్ లెవెల్స్ కూడా తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

**బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్:**

తలనొప్పి నుండి బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్ మంచి ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్ చేయడం అందరి వల్ల సాధ్యం అవ్వదు. కానీ.. బ్రీతింగ్ ఎక్సర్సైజెస్ వల్ల బాడీ మజిల్స్ రిలాక్స్ అయ్యి స్ట్రెస్ లెవెల్స్ కూడా తగ్గుతాయి. క్రమం తప్పకుండా బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్ చేయడం ద్వారా తలనొప్పి నుండి ఉపశమనం పొందొచ్చు.

**డైట్ లో మార్పులు:**

చలికాలంలో తలనొప్పికి కారణమయ్యే కెఫైన్ వంటి పదార్థాలను డైట్ నుండి తీసేయడం మంచిది. ఎక్కువ కెఫైన్ ఉన్న పదార్థాలను తీసుకోవడం వల్ల బాడీ త్వరగా డిహైడ్రేట్ అయ్యి తలనొప్పికి దారి తీస్తుంది. చలికాలంలో తరచూ తలనొప్పి రాకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా తాగాలి.. ఎక్కువగా నీరు తాగటం వల్ల శరీరంలోని టాక్సిన్స్ అన్ని బయటకు పోయి తలనొప్పి వచ్చే ఛాన్స్ ని తగ్గిస్తుంది.

**డాక్టర్ ని సంప్రదించండి:**

పైన తెలిపిన టిప్స్ ఫాలో అయినప్పటికీ తలనొప్పి తగ్గకపోతే డాక్టర్ ని సంప్రదించటం మంచిది. డాక్టర్ తలనొప్పికి గల కారణాన్ని అనలైజ్ చేసి దానికి తగ్గ ట్రీట్మెంట్ ఇస్తారు కాబట్టి తలనొప్పిని నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ ని సంప్రదించటం మంచిది.

బీజీటీ ప్రెజెంటేషన్‌లో గవాస్కర్‌ను పట్టించుకోని ఆస్ట్రేలియా..

# క్రికెట్ దిగ్గజం ఆసక్తికర వ్యాఖ్యలు

ట్రోఫీ ప్రెజెంటేషన్‌కు ఆహ్వానించకపోవడంపై దిగ్గజ క్రికెటర్ అసంతృప్తి

పిలిచి ఉంటే సంతోషించేవాడినంటూ విచారం

మైదానంలోనే ఉన్నా పట్టించుకోలేదంటూ గవాస్కర్ ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య హై-వోల్టేజ్ వాతావరణంలో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆదివారంతో ముగిసింది. ఆతిథ్య జట్టు ఆసీస్ 3-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ట్రోఫీని దక్కించుకోవడంతో ఆ జట్టు ఆటగాళ్లు కాస్త గట్టిగానే సెలబ్రేట్ చేసుకున్నారు. అయితే, ట్రోఫీ ప్రెజెంటేషన్ ఈవెంట్‌కు భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌ను పిలవలేదు. గవాస్కర్ మైదానంలోనే ఉన్నప్పటికీ ఆయనను క్రికెట్ ఆస్ట్రేలియా పట్టించుకోలేదు. గవాస్కర్ పేరు మీదుగానే ట్రోఫీకి పేరు పెట్టినప్పటికీ ఆయనను విస్మరించడంపై విరమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఆసీస్ మాజీ దిగ్గజం అలెన్ బోర్డర్ ఒక్కరే ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ట్రోఫీని అందించారు. ప్రజెంటేషన్ ఈవెంట్‌కు తనను ఆహ్వానించకపోవడంపై సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను భారతీయుడిని కాబట్టి తనను పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను మైదానంలోనే ఉన్నాను... నన్ను పిలవొచ్చు కదా. నా బెస్ట్ ఫ్రెండ్ అలెన్ బోర్డర్‌తో కలిసి ట్రోఫీని అందజేసి ఉంటే సంతోషించేవాడిని. ప్రజెంటేషన్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు నేను ఇష్టపడతాను" అని ఆయన వ్యాఖ్యానించారు.ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కావడంతో ప్రజెంటేషన్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు మరింత ఇష్టపడేవాడినంటూ విచారం వ్యక్తం చేశారు. ట్రోఫీ ప్రజెంటేషన్ విషయానికి వస్తే ఏ జట్టు గెలిచినా పర్వాలేదని, బాగా ఆడారు కాబట్టి ఆస్ట్రేలియా గెలిచిందని సునీల్ గవాస్కర్ వ్యాఖ్యానించారు.

ఈ మేరకు 'కోడ్ స్పోర్ట్స్'తో ఆయన మాట్లాడారు. కాగా, భారత్, ఆస్ట్రేలియా మధ్య 1996-1997 నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మొదలైంది. టెస్ట్ ఫార్మాట్ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక ట్రోఫీలో ఒకటిగా పేరుపొందింది. ప్రస్తుతం సీజన్‌లో మ్యాచ్‌లను వీక్షించేందుకు క్రికెట్ లవర్స్ స్టేడియాలకు పోటెత్తారు.

# రోహిత్ శర్మ రిటైర్ అవుతున్నాడా?... రిపోర్టర్ల ప్రశ్నకు కోచ్ గంభీర్ సమాధానం ఇదే!

- మీడియా మరింత సహేతుకంగా ఉండాలంటూ అసహనం వ్యక్తం చేసిన హెడ్ కోచ్
- రోహిత్ రిటైర్‌మెంట్ కథనాలను కొట్టిపారేసిన గౌతమ్ గంభీర్
- జట్టు ప్రయోజనం కోసం సిడ్నీ టెస్ట్‌లో ఆడకూడదని రోహిత్ నిర్ణయించుకున్నాడని వెల్లడి
- గొప్ప పరిపక్వత ప్రదర్శించాడంటూ గంభీర్ ప్రశంసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో చివరిదైన సిడ్నీ టెస్టులో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆడకపోవడంతో టెస్ట్ ఫార్మాట్ క్రికెట్ నుంచి హిట్‌మ్యాన్ రిటైర్ కానున్నాడంటూ జోరుగా ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో రోహిత్ భవిష్యత్ ఏంటంటూ భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ప్రశ్నించగా ఆసక్తికరంగా స్పందించాడు. మీడియా ప్రతినిధులు అడిగిన ఈ ప్రశ్నకు గంభీర్ కాస్త అసహనంతో సమాధానం ఇచ్చాడు."రోహిత్ శర్మ విషయంలో నేను మొదట చెప్పదలచుకున్న విషయం ఏంటంటే మీరు (మీడియా ప్రతినిధులు) మరింత సహేతుకంగా వ్యవహరించాలి" అని గంభీర్ మండిపడ్డాడు. సిడ్నీ టెస్ట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకొని రోహిత్ గొప్ప పరిపక్వత కనబరిచాడని, కానీ కెప్టెన్ గురించి కొన్ని అర్థంపర్థంలేని వార్తలు రాశారని గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.చాలా కథనాలు రాశారని, చాలా విషయాలు చెప్పారని అన్నాడు. జట్టు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కెప్టెన్ తీసుకున్న నిర్ణయంపై చాలా చెడు ప్రచారం చేశారని విమర్శించాడు. వ్యక్తులకు సంబంధించిన వ్యవహారమనే విషయాన్ని మీడియా మరచిపోకూడదని, అంతకుమించి జట్టు, దేశం ముఖ్యమని గంభీర్ చెప్పాడు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టుకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని గంభీర్ వ్యాఖ్యానించాడు.

పేసర్ జస్ప్రీత్ బుమ్రా సిడ్నీ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో అందుబాటులో ఉంటే బాగుండేదని గంభీర్ అభిప్రాయపడ్డాడు. అయితే, జట్టు ఒక్కరిపై ఆధారపడకూడదని పేర్కొన్నాడు. ఈ మేరకు సిడ్నీ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడారు.

# టీమిండియా కలలన్నీ కల్లలు.. అప్‌డేట్ అయిన డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ ఇదే




**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలన్న టీమిండియా కలలన్నీ కల్లలయ్యాయి. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 1-3 తేడాతో చేజార్చుకోవడంతో తుది పోరుకు అర్హత సాధించే అవకాశాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. సిడ్నీ వేదికగా ఐదవ టెస్ట్ మ్యాచ్ ముగిసిన తర్వాత డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టిక అప్‌డేట్ అయింది.భారత్ 50 పీసీటీ పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా జట్టు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా 63.73 పీసీటీ పాయింట్లతో నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించింది. దక్షిణాఫ్రికా ఇప్పటికే 66.67 పీసీటీ పాయింట్లతో ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్న విషయం తెలిసిందే. పాయింట్స్ టేబుల్‌లో టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయన్న విషయం తెలిసిందే.బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో ప్రస్తుతం డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్ మ్యాచ్‌లన్నీ ముగిసిపోయాయి. మిగతా జట్లకు కూడా ఫైనల్ చేరుకునే అవకాశాలు లేవు. దీంతో జూన్ 11 నుంచి 15 మధ్య ఇంగ్లాండ్‌లోని లార్డ్స్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది.కాగా, సిడ్నీ టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. సిరీస్‌లో భాగంగా పెర్త్‌లో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించగా... ఆ తర్వాత జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకటి డ్రా అవగా, మిగతా మ్యాచ్‌లు అన్నింటిలోనూ భారత్ పరాజయం పాలైంది. దాదాపు 10 సంవత్సరాల తర్వాత టీమిండియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది.



డిజైనర్ డ్రెస్‌లో కరిష్మా తన్నా అబ్బురపరిచే క్లిక్‌లు

# యంగ్ హీరోకి పోటీగా మెగాస్టార్ !




మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన ఎన్నో చిత్రాల్లో తేజ సజ్జా చిరంజీవి చైల్డ్ హుడ్ పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తేజ యంగ్ హీరోగా మారి సినిమాలే చేస్తున్నాడు. 'హనుమాన్' విజయంతో పాన్ ఇండియా మార్కెట్ లోకి ఎంటర్ అయ్యాడు. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు వస్తున్నాయి. 'మిరాయ్' అనే సినిమా సోషియా ఫాంటసీ చిత్రంలో నటిస్తున్నాడు. తొలి సినిమా 'హనుమాన్' కూడా సోషియా ఫాంటసీ బ్యాక్ డ్రాప్ లో రిలీజ్ అవ్వ డంతో పెద్ద విజయం సాధించింది.

దీంతో 'మిరాయ్' లో వార్ బ్యాక్ డ్రాప్ ని టచ్ చేస్తూ అదే అంశాన్ని తీసుకున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో ఆ సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయింది. అయితే ఇప్పుడిదే హీరోతో మెగాస్టార్ చిరంజీవి పోటీకి దిగుతున్నారు. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా వశిష్ట దర్శకత్వంలో 'బింబిసార' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇది సోషియా ఫాంటసీ చిత్రం. 'జగదీక వీరుడు అతిలోక సుందరి', 'అంజి' తర్వాత చిరంజీవి నటిస్తోన్న సోషియా ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ ఇది.చాలా గ్యాప్ తర్వాత సోషియా ఫాంటసీని చిరు టచ్ చేయడంతో? యంగ్ హీరో తేజకి పోటీగా దిగుతున్నట్లే కనిపి స్తుంది. ఎందుకంటే చిరు కంటే ముందే 'హనుమాన్' తో తేజ ఆ జానర్ లో సినిమా చేసాడు. 'మిరాయ్' కూడా అదే జానర్లో రూపొందుతుంది. పైగా చిరంజీవి చిన్నప్పటి పాత్రలు పోషించిన తేజ తో చిరు పోటీ అన్నది అభిమానులకు క్రేజీగా ఉంది. మరి ఈ రెండు సినిమాలు ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని పంచుతాయో చూడాలి.ఈ రెండు సినిమాలు ఇదే ఏడాది రిలీజ్ కానున్నాయి. 'విశ్వంభర' సమ్మర్ లో రిలీజ్ అవుతుందని సమాచారం. 'మిరాయ్' అప్ డేట్స్ మాత్రం రావడం లేదు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసినిమా కోసం విదేశీ నటులు, సాంకేతిక నిపుణులు కూడా పనిచేస్తున్నారు.



నీలి రంగులో నికితా దత్తా యొక్క ట్రెండీ ఫోటోషూట్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com